క్లుప్తంగా

చేయూత నిధులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నెల్లిమర్ల రూరల్: అర్హులైన లబ్ధిదారులకు చేయూత నిధులను తక్షణమే మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు డిమాండ్ చేశారు. మండలంలోని కొండగుంపాంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేయూత నిధులు అందించిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమకాలేదని చెప్పారు. విడుదలైన నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామునాయుడు, సూరి, పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పతివాడలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, తదితరులు

పూసపాటిరేగ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుంపాం, పతివాడ, పూసపాటిపాలెం గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. గుంపాం పంచాయతీ తొత్తడాంలో లీకైన పైపులైన్‌ను అక్కడికక్కడే బాగు చేయించారు. అలాగే పతివాడలో పంచాయతీ కాలువ సమీపంలో ఉన్న కుళాయిని వేరే చోటుకు మార్చాలని సూచించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శులున్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి


కుమిలిలో విత్తనాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ : రాయితీపై సరఫరా చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కుమిలి గ్రామ ప్రజాప్రతినిధులు గుజ్జు సురేష్‌రెడ్డి, మద్దల మురళి అన్నారు. మండలంలోని కుమిలి గ్రామంలో రాయితీపై సరఫరా చేసిన వరి విత్తనాలను రైతులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన వరి విత్తనాలను పూర్తిస్థాయిలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. వెంకటప్పడు, ప్రజాప్రతినిధులు డి. గౌతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి యాదవుల సమస్యలు

విజయనగరం టౌన్: యాదవులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో మేకల రాములు, జి.అయ్యన్న , జాజుల శ్రీనివాస్, మొల్లి అప్పన్న, జేవీ కృష్ణయ్య, శ్రీరాములు, కె.శేషు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం సందర్శన

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం సందర్శించారు. వసతి గృహంలో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం, ఇతర సదుపాయాలపై ఆరాతీశారు. పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి వరకు మాత్రమే విద్యాబోధన ఉందని, ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసేలా చూడాలని ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో ఎమ్మెల్యేను కోరా రు. చందులూరు గ్రామానికి చెందిన సాహసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎం.గణేష్ సమకూర్చిన మూడు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, పుస్తకాల ర్యాక్‌ను ఎమ్మె ల్యే చేతుల మీదగా పాఠశాలకు అందజేశారు.ప్రభుత్వం సమకూర్చిన దుప్పట్లు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని విద్యార్థినులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కె.ఈశ్వరరావు,ఎల్.కోట హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రశ్నార్థకం..!

- ఆహార పదార్థాల తయారీలో హోటళ్లు, రెస్టారెంట్ల తీరు అధ్వానం
- అధికారుల తనిఖీల్లో బట్టబయలవుతున్న వాస్తవాలు
- నగరంలో ఇష్టారాజ్యంగా సాగుతున్న వ్యాపారం


వినియోగదారుడు ఫిర్యాదు మేరకు రెస్టారెంట్‌లోని వంటలు పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్‌మీరా

విజయనగరం: నగరానికి చెందిన హరీష్ అనే వినియోగదారుడు ఈనెల 18న ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు రెస్టారెంట్‌ను పరిశీలించిన ఫుడ్ సెఫ్టీ అధికారులు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన హరీష్ రింగ్‌రోడ్ ప్రాంతంలో గల ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో ఉలవచారు బిర్యాని కావాలంటూ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. ఇంటికి వచ్చిన ఆర్డర్‌ను తెరిచి చూడగా.. పార్సిల్‌లో పురుగులు కనబడడంతో అవాక్కయ్యాడు. వెంటనే ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా.. కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణంలో వంటకాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. వాస్తవానికి మనం వినియోగించే వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్ మోతాదు 25లోపు ఉండాల్సి ఉండగా... 38 శాతం ఉన్నట్లు ధృవీకరించారు. ఇటువంటి కలుషిత నూనెలతో తయారు చేసిన ఆహారాన్ని తింటే గ్యాస్టిక్, క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నయని హెచ్చరించారు. అనంతరం సదరు రెస్టారెంట్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఇదేదో ఒక్క హరీష్‌కు ఎదురైన సంఘటన కాదు. నగరంలో ఆహార పదార్థాలను హోటళ్లు, రెస్టారెంట్‌ల ద్వారా కొనుగోలు చేస్తున్న వారిలో ప్రతిరోజూ ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యగా మారింది.

ఆలోచించండి..

హోటళ్లు, రెస్టారెంట్‌లలో భోజనం చేస్తున్నారా.. లేదా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడుతున్నారా.. ఒక్కసారి ఆలోచించండి. అపరిశుభ్రంగా వంటశాలలు, కుళ్లిపోయిన మాంసం, పాడైన కూరగాయలు, వస్తువులను వినియోగించి నిర్వాహకులు వంటలు తయారు చేస్తున్నారన్న విషయం గుర్తుంచుకోండి. ఇటీవల ఆహార కల్తీ నియంత్రణ విభాగం అధికారులు నిర్వహించిన దాడుల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. చాలా హోటళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్వయానా అధికారులే వెల్లడించడం గమనార్హం. రెగ్యులర్‌గా సంబంధిత శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడం.. రంగులు, హంగులతో పైకి బాగా కనిపించేలా వంటకాలు సిద్ధం చేస్తుండటంతో వినియోగదారులు నాణ్యత విషయాన్ని పట్టించుకోవడం లేదు. నాణ్యత లేని ఆహారం తిని అస్వస్థతకు గురికావడం, హోటళ్లపై ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు దాడి చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

కన్నెత్తిచూడని అధికారులు

మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లను ఆసరా చేసుకుని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో ఎక్కువగా ఆహార కల్తీ సాగుతోంది. అయినప్పటికీ ఉన్నతాధికారులు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో జరిగే మోసాలు, లోపాలపై దృష్టి సారిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది. జిల్లాలో ఆహార తనిఖీ విభాగంలో సిబ్బంది కొరత, ఇతర శాఖల అధికారుల్లో నిర్లక్ష్యం, ప్రజల్లో అవగాహన లోపం.. ధనార్జనే ధ్యేయంగా చెలరేగుతున్న అక్రమ వ్యాపారుల ధోరణి వెరసి ప్రజారోగ్యం కల్తీకి గురవుతోంది. కాగ్ నిబంధనల ప్రకారం పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రతి 50 వేల మందికి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే ప్రతి లక్ష మందికి ఒక ఆహార తనిఖీ అధికారి ఉండాలి. ప్రస్తుతం ఆ స్థాయిలో అధికారులు, సిబ్బంది లేరు. చికెన్ పకోడీ, బజ్జీ దుకాణాలు, టిఫిన్ సెంటర్లలో రోజూ కాగిన నూనెనే వాడడంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది.


వండేందుకు ఉంచిన నిల్వ సామగ్రి


రెస్టారెంట్ నిర్వాహకులు వినియోగించే నూనెలో టీపీసీ కౌంట్ తనిఖీ చేస్తున్న దృశ్యం

పత్తాలేని సమీక్షలు..

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో నెలకోసారి సమావేశాలు పెట్టి శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు దిశానిర్దేశం చేయాలి. ఆ దిశగా ఎక్కడా సమావేశాలు పెట్టిన దాఖలాల్లేవు. ఇది ఆ శాఖ పనితీరుకు అద్దం పడుతోంది. జిల్లా కేంద్రంలో కూర్చుని ఎప్పుడో ఓసారి తనిఖీ చేసి రికార్డుల్లో చూపుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ పుట్టగొడుగుల్లా తాగునీటి శుద్ధి ప్లాంటు వెలిశాయి. అవి ప్రమాణాల ప్రకారం నడుస్తున్నాయా? లేదా? అని కూడా తనిఖీ చేయడం లేదు.

తనిఖీలు చేస్తున్నాం..

మాకు కేటాయించిన ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేస్తున్నాం. లోపాలు ఉంటే కేసులు నమోదు చేస్తున్నాం. మున్సిపాలిటీల్లోనూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తనిఖీ చేసే అధికారం ఉంది. అన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేయిస్తాం.

– నాగుల్‌మీరా,
ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్, విజయనగరం.

మత్తుతో జీవితం చిత్తు


నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

- సీనియర్ సివిల్ జడ్జి విజయకల్యాణి

విజయనగరం క్రైమ్: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కె. విజయకల్యాణి అన్నారు. బుధవారం స్థానిక ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో మత్తు పదార్థాల వాడకం, రవాణా వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సంతోష్ , కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బానిసకావద్దు

మత్తుపదార్థాలకు యువత బానిస కావద్దని అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి.జగదీశ్వరరావు అన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా దాసన్నపేట రైతుబజార్ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకు వివిధ కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్లతో ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు మూర్తి, జ్ఞానేశ్వరి, రమేష్ , అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

దూరంగా ఉండాలి

నెల్లిమర్ల: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ బి. వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పోలీసులు, ఎస్‌ఈబీ, సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మిమ్స్ ఆస్పత్రి వద్ద ఆయన మాట్లాడుతూ.. గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల విచక్షణ కోల్పోయి ఉన్మాదులుగా మారే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ పీటీవీ కుమార్, ఎస్సై డి. రామగణేష్, సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ లెంక సంధ్య, పోలీసులు పాల్గొన్నారు.


విజయనగరం క్రైమ్: మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.విజయకల్యాణి


పూసపాటిరేగ: ర్యాలీ చేస్తున్న ఎస్సై సన్యాసినాయుడు, తదితరులు

మాదక ద్రవ్యాలను నిరోధించాలి

పూసపాటిరేగ : మాదకద్రవ్యాలను నిరోధించాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, యువత మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తులో యువత నేరాలకు పాల్పడుతున్నారని, మత్తును నిర్మూలిస్తే నేరాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

- ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం ఆనందరావు


ప్రకృతిసాగులో వేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

పూసపాటిరేగ : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు వచ్చి, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని ఎరుకొండలో సెయింట్ ఏన్స్ సంస్థ ద్వారా రైతులకు 18 రకాల విత్తనాలు కలిపిన కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మితిమీరిన రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేలలో జీవవైవిధ్యం పోతుందని చెప్పారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందడానికి ప్రకృతి వ్యవసాయమే మార్గమన్నారు. ప్రతి రైతు జీలుగ , జనుముతో పాటు కనీసం 18 రకాల విత్తనాలు కలిపి పొలంలో ఖరీఫ్ ముందు వచ్చే తొలకరి వర్షాలకు పొలంలో చల్లుకొని 45 రోజులు తర్వాత కలియ దున్నాలని సూచించారు. ఇలా చేయడం వల్ల భూమికి కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొల్లి నిర్మల, ప్రకృతి వ్యవసాయం టెక్నికల్ అధికారి ప్రకాష్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


హాజరైన అధికారులు, సిబ్బంది

- నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు

విజయనగరం: ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, అతిసార, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజారోగ్య విభాగం సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. కాలానుగుణ వ్యాధుల నియంత్రణపై బుధవారం తన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో తాగునీటి వనరులు కలుషితం కాకుండా చర్యలు చేపట్టడం, నీటి వనరుల్లో క్లోరినేషన్ చేయడం, పారిశుధ్య నిర్వహణ వంటి చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి


అశోక్‌గజపతిరాజుతో ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం రూరల్: కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్‌గజపతిరాజు 74వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు అశోక్ బంగ్లాలో మాజీ మంత్రిని బుధవారం కలిశారు. అలాగే సీనియర్ నాయకులు పతివాడ నారాయణ స్వామి నాయుడు, ఆర్‌పీ భంజ్‌దేవ్, తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాల్లో అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు.

తిరిగి విధుల్లోకి తీసుకోండి..


డెంకాడ: తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ డెంకాడ సచివాలయ మాజీ గ్రామ వలంటీర్లు ఎంపీడీఓ లవరాజుకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. 24 మంది వలంటీర్లు 2019 సంవత్సరం నుంచి 2024 మార్చి వరకు ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలు అందించారన్నారు. 2024 మార్చిలో కొన్ని అనివార్య కారణాల వల్ల విధులకు రాజీనామా చేశామని చెప్పారు. మానవతాదృక్పథంతో ఐదేళ్ల పాటు సేవలు అందించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు కోరారు.

81 యూనిట్ల రక్తం సేకరణ


రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

డెంకాడ: కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు 74వ జన్మదినం పురస్కరించుకుని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎంవీజీఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా కేంద్ర ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో అధ్యాపకులు, విద్యార్థులు 81 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలకు మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అభినందించారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, డైరెక్టర్ పి.సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, కోఆర్డినేటర్ ఎం.అనిల్‌ప్రకాష్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, డీన్స్, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి


మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పీరుబండి హైమావతి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తరచూ పారిశుధ్య పనులు చేయించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించా లన్నారు. ఏ గ్రామంలోనైనా వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాధులు అదుపులోకి వచ్చే వరకు శిబిరాలను కొనసాగించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఎంపీడీఓ భవాని, గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు క్యాన్సర్ ఆస్పత్రి మంజూరు చేయండి

- మంత్రి కొండపల్లికి వివరాలు అందించిన భీశెట్టి


మంత్రి కొండపల్లికి వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ, తదితరులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాకు క్యాన్సర్ ఆస్పత్రి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి సాధన సమితి అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈ మేరకు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. మగవారు గొంతు, మహిళలు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ తో ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఉంది కాబట్టి, క్యాన్సర్ ఆస్పత్రి మంజూరు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో జానకిరామ్, గజపతినగరం మాజీ ఎంపీపీ మక్కువ శ్రీధర్, తదితరులున్నారు.

కుక్కలకు శస్త్రచికిత్సలు

- కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి


కుక్కల శస్త్ర చికిత్సల నిర్వహణను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

విజయనగరం : అన్ని జాగ్రత్తలతో వీధి కుక్కలకు సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశాల మేరకు బుధవారం కొత్తపేటలో ఉన్న స్టెరిలైజేషన్ సెంటర్‌లో కుక్కలు శస్త్రచికిత్సలు, యాంటీ ర్యాబిస్ టీకాలు వేయడాన్ని పశుసంవర్ధక శాఖ, జంతు సంక్షేమ సంఘం, బ్లూ క్రాస్, ప్రజారోగ్యశాఖ సిబ్బంది, సభ్యులు పరిశీలించారు. అనంతరం ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ.. ఏప్రిల్ 19 నుంచి నేటి వరకు 1,395 కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను, సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. శస్త్ర చికిత్సలు పూర్తయిన కుక్కలను ఆరు రోజుల పాటు స్టెరిలైజేషన్ సెంటర్‌లో పర్యవేక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ టి. మోహన్, జంతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, బ్లూ క్రాస్ ప్రతినిధి మద్దిల సోంబాబు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పూడికతీత పనులు


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలోని ప్రధాన కాలువలతో పాటు చిన్న, చిన్న కాలువలలో కూడా పూడికలు ఉండరాదని పారిశుధ్య సిబ్బందికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం నాయుడు ఆదేశించారు. నగరంలోని 49వ డివిజన్ కంటోన్మెంట్, కేఎల్ పురం ప్రాంతాలలో బుధవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కంటోన్మెంట్ గణేష్ కోవెల సమీపంలో చాలా కాలంగా పూడికలు పేరుకుపోవడంతో వర్షపు నీరు రహదారులపై ప్రవహిస్తుందని గమనించిన కమిషనర్ వెనువెంటనే పూడికలు తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాలువల ద్వారా వర్షపునీరు ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వ్యర్థపదార్థాలతో ఆకర్షణీయంగా తయారు చేసిన పూల కుండీలను పరిశీలించారు. కార్యాలయం ఆవరణలో వాటిని ఏర్పాటు చేయడాన్ని చూసి, వాటిని రూపొందించిన ప్రజారోగ్య సిబ్బందిని అభినందించారు.